క్లుప్తంగా

న్యాయవాదులు విధుల బహిష్కరణ



నందిగామ: ఇటీవల న్యాయవాదులపై దాడులు పెరిగాయని ఇది మంచి పద్ధతి కాదని నందిగామ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బండి మల్లికార్జునరావు అన్నారు. ఉత్తరప్రదేశ్‌లో న్యాయవాదులపై పోలీసులు చేసిన లాఠీ చార్జిని నిరసిస్తూ శుక్రవారం నందిగామ బార్ అసోసియేషన్ ఆధ్వర్యాన న్యాయవాదులు విధులు బహిష్కరించి నిరసన తెలిపారు. కార్యక్రమంలో న్యాయవాదులు ప్రకాష్, దాసరి వెంకటరావు, బొందలపాటి రామకృష్ణ, సాంబశివరావు, నంద్రు బాబు, విద్యాసాగర్, మాలేశ్వర రావు, లక్ష్మీనారాయణ, ఆజాద్ పాల్గొన్నారు.

నేడు జాతీయ లోక్ అదాలత్
న్యాయమూర్తి శోభారాణి

జగ్గయ్యపేట అర్బన్: స్థానిక కోర్టు ఆవరణలో ఈ నెల 9వ తేదీ శనివారం నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌ను ప్రతిఒక్కరూ వినియోగించుకోవాలని న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ ఎం.శోభారాణి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాజీ చేసుకునే ఇరు వర్గాలు శనివారం కోర్టుకు హాజరైతే వారిని న్యాయస్థానంలో ప్రవేశపెట్టి, ఆ కేసును పూర్తిగా క్లోజ్ చేస్తారని వివరించారు.

నూతన పింఛన్ల పంపిణీ

జయంతి(వీరులపాడు): కులమతాలు, పార్టీల కతీతంగా సంక్షేమ పథకాలను అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికే దక్కిందని సర్పంచ్ మారపాక మహాలక్ష్మి పేర్కొన్నారు. మండలంలోని జయంతి గ్రామ సచివాలయంలో నూతనంగా మంజూరైన పింఛన్లను శుక్రవారం లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ గ్రామానికి కొత్తగా 24 పింఛన్లు మంజూరయ్యాయన్నారు. గతంలో మాదిరిగా కాకుండా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు ఇప్పల సత్యనారాయణ రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ జంగా కోటిరెడ్డి, పలువురు నాయకులు పాల్గొన్నారు.

అన్నదానానికి విరాళం



పెనుగంచిప్రోలు: గ్రామంలోని శ్రీతిరుపతమ్మ ఆలయంలో నిత్యాన్నదాన పథకానికి శుక్రవారం జుజ్జూరు మండలం పొన్నవరం గ్రామానికి చెందిన కొంగర సుజాత రూ.10,116ను ఆలయ కమిటీ చైర్మన్ ఇంజం చెన్నకేశవరావు చేతుల మీదుగా అందజేశారు. ఆలయ అధికారులు దాతలకు అమ్మవారి శేషవస్త్రం, ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ సునీత, పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

పాఠశాలలకు టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్ అందజేత



గండ్రాయి(జగ్గయ్యపేట): గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు అవసరమైన టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్‌ను శుక్రవారం హెచ్‌ఎం రమేష్‌బాబుకు అందజేశారు. గ్రామానికి చెందిన దాత వాసుబాబు సౌజన్యంతో రూ. 30 వేల విలువ చేసే మెటీరియల్‌ను ఇచ్చారు. గ్రామస్తుడు బొమ్మిశెట్టి శ్రీనివాసరావు ఇనుప బీరువాను అందజేశారు. దాతలకు విద్యార్థులు, ఉపాధ్యాయులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎంఈఓ చిట్టిబాబు, గ్రామ పెద్దలు నారసాని రాంబాబు, రాజేంద్ర, ఉపాధ్యాయులు జ్యోతికుమారి, సుబ్బారావు, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

12, 13 తేదీల్లో మండల క్రీడాకారుల ఎంపిక

పెనుగంచిప్రోలు: ఎన్టీఆర్ జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 12, 13 తేదీల్లో స్థానిక కేవీఆర్ జెడ్పీ హైస్కూల్ ఆవరణలో మండల క్రీడాకారుల ఎంపిక నిర్వహిస్తున్నట్లు మండల స్పోర్ట్స్ కన్వీనర్ వేగినేటి వెంకటరమణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కోకో, కబడ్డీ, టెన్నికాయిట్, త్రోబాల్, వాలీబాల్, యోగా, షటిల్ బ్యాడ్మింటన్, బాల్ బ్యాడ్మింటన్, అథ్లెటిక్స్‌లో అండర్-14, అండర్-17 బాలబాలికలకు పోటీలు జరుగుతాయని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలలో, గుర్తింపు పొందిన విద్యా సంస్థల్లో చదువుతున్న క్రీడాకారులు పాల్గొనవచ్చని సూచించారు.

12 ఆటోలపై కేసు నమోదు

నందిగామ: నిబంధనలు పాటించకుండా నడుపుతున్న 12 ఆటోలపై శుక్రవారం నందిగామ పోలీసులు కేసు నమోదు చేశారు. ఇన్‌స్పెక్టర్ హనీష్ తెలిపిన సమాచారం ప్రకారం రవాణా శాఖ నిబంధనలు పాటించని ఆటోలను గుర్తించిందని తెలిపారు. గుర్తించిన 12 ఆటోలపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఆదిశక్తి మహేశ్వరి..

- ఆలయాల్లో శ్రావణ శోభ
- ఘనంగా సామూహిక వరలక్ష్మీ వ్రతాలు



సత్యమ్మకు గాజులతో అలంకరణ

నందిగామ: అష్టైశ్వర్య ప్రదాయిని.. వరలక్ష్మి అంటూ భక్తజనం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. శ్రావణ శుక్రవారం సందర్భంగా ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. మహిళలు పెద్ద సంఖ్యలో ఆలయాలకు తరలివచ్చి అమ్మవార్లను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేయించారు. శ్రావణ మాసం నాల్గో శుక్రవారం కావడంతో ఆలయాల్లో పలు రకాల పూజలతోపాటు కుంకుమార్చనలు జరిగాయి. పట్టణంలోని మరిడి మహాలక్ష్మమ్మ ఆలయం, రామలింగేశ్వర స్వామి ఆలయాల్లో కుంకుమ పూజలు చేశారు. శ్రీపురంలోని వాసవి కన్యక పరమేశ్వరిని ధాన్యలక్ష్మి దేవిగా అలంకరించి పాడి పంటలు సమృద్ధిగా పండాలని కోరుకుంటూ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని రూ.7 లక్షల కరెన్సీ నోట్లతో అలంకరించారు. మండలంలోని అంబారుపేటలోని శ్రీ సత్యమ్మను 12 వేల గాజులతో అలంకరించి ప్రత్యేక పూజలు, కుంకుమార్చనలు నిర్వహించారు. పట్టణ శివారుల్లోని పల్లగిరి గట్టుపై ఉన్న త్రిశక్తి పీఠంలోని కనక దుర్గ, కనక మహాలక్ష్మి, జ్ఞాన సరస్వతి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు, సామూహిక కుంకుమార్చనలతో పాటు పలు రకాల హోమాలు చేశారు.

పెనుగంచిప్రోలు ఆలయంలో..

పెనుగంచిప్రోలు(జగ్గయ్యపేట): శ్రావణమాసంలో చివరి శుక్రవారం కావడంతో పెనుగంచిప్రోలులోని తిరుపతమ్మ ఆలయంలో సామూహిక వరలక్ష్మీ వ్రతం ఘనంగా చేశారు. ప్రతి మహిళకు జాకెట్ ముక్క, పూజ చేసిన అమ్మవారి రూపు అందజేశారు. అమ్మవారి విశేష అలంకరణ భక్తులను ఎంతో ఆకట్టుకుంది. ఆలయ కమిటీ చైర్మన్ ఇంజం చెన్నకేశవరావు, ఏఈఓ తిరుమలేశ్వరరావు, సూపరింటెండెంట్ సునీత, ఈఈ వైకుంఠరావు, ఏఈ రాజు, పాలకవర్గ సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

జగ్గయ్యపేటలో..

జగ్గయ్యపేట అర్బన్: స్థానిక అద్దాల బజారులోని శ్రీ మహాలక్ష్మి వెండి దేవాలయం, నకాశిబజారులో ఉన్న శ్రీకనకదుర్గ ఆలయం, దుర్గాపురంలోని శ్రీదుర్గామల్లేశ్వరస్వామి ఆలయం, అయ్యప్పనగర్‌లోని అయ్యప్పస్వామి ఆలయంలోని అష్టలక్ష్మి సహిత వైభవలక్ష్మి తదితర ఆలయాల్లో అమ్మవార్లకు ప్రత్యేక అభిషేకాలు, సామూహిక వరలక్ష్మీ వ్రతాలు, కుంకుమార్చనలు నిర్వహించారు. నకాశి బజారులోని కనకదుర్గ అమ్మవారికి విశేషంగా చందన అలంకరణ చేశారు. మహాలక్ష్మి వెండిదేవాలయంలో అమ్మవారిని గాజులతో విశేషంగా అలంకరించారు. వెండి దేవాలయం ఆలయ కమిటీ చైర్మన్ అత్తులూరి వెంకటేశ్వర్లు, శ్రీకనకదుర్గ ఆలయ ప్రైవేటు ఇంప్రూవ్‌మెంటు కమిటీ సభ్యులు, దుర్గామల్లేశ్వరస్వామి ఆలయ కమిటీ సభ్యులు, అయ్యప్పస్వామి ఆలయంలో కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.



అమ్మవారి ఆలయంలో సామూహిక కుంకుమార్చన



కరెన్సీ నోట్ల అలంకరణలో వాసవి కన్యకా పరమేశ్వరి



తిరుపతమ్మ ఆలయంలో భక్తజన సందడి



పెనుగంచిప్రోలు ఆలయంలో సామూహిక వరలక్ష్మి వ్రతాలు



వెండి మహాలక్ష్మి ఆలయంలో..

విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరుకోవాలి

కంచికచర్ల: సాంకేతిక పరిజ్ఞానం అందిపుచ్చుకుని విద్యార్థులు ఉన్నత శిఖరాలను చేరుకోవాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు పేర్కొన్నారు. కంచికచర్లలో ఏకత్వ సీబీఎస్ఈ ప్రైవేటు పాఠశాల నిర్మాణానికి శుక్రవారం భూమి పూజ చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ ఉత్తమ పౌరులుగా విద్యార్థులను తీర్చిదిద్దడానికి పాఠశాలలు ప్రధాన భూమిక పోషించాలన్నారు. కార్యక్రమంలో నందిగామ ఎమ్మెల్యే మొండితోక జగన్‌మోహనరావు, ఎమ్మెల్సీ అరుణ్‌కుమార్, ఎంపీ కేశినేని నాని, స్కూల్ కరస్పాండెంట్ రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.



కంచికచర్లలో స్కూల్‌కు శంకుస్థాపన చేస్తున్న కలెక్టర్ ఢిల్లీరావు, ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

ఉచిత వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలి

మొర్సుమల్లి(మైలవరం): గ్రామాల్లో నిర్వహిస్తున్న ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మొర్సుమల్లి సర్పంచ్ మాడపాటి రమాదేవి సూచించారు. మైలవరం మండలం మొర్సుమల్లి తండాలో కేఎల్ యూనివర్సిటీ స్టూడెంట్ ఆక్టివిటీ సెంటర్, స్మార్ట్ విలేజ్ రెవల్యూషన్ ఆధ్వర్యంలో ఫార్మసీ, బయోటెక్నాలజీ విద్యార్థులు గ్రామస్తులకు శుక్రవారం బ్లడ్ గ్రూప్ పరీక్షలు, బీపీ పరీక్షలు చేశారు. తండాలోని ప్రతి ఒక్కరి ఇంటికీ వెళ్లి ఈ సేవలు అందించారు.
150 మంది గ్రామస్తులకు రక్త పరీక్షలు నిర్వహించి బ్లడ్ గ్రూప్ తెలిపామని ఫార్మసీ అధ్యాపకురాలు డాక్టర్ సుకీర్తి పేర్కొన్నారు. కేఎల్ యూనివర్సిటీ స్మార్ట్ విలేజ్ కోఆర్డినేటర్ పి.వి.సత్యనారాయణ, ఏఎన్ఎం యు.రాజేశ్వరి, ఆశా వర్కర్ పార్వతి, గ్రామస్తులు, ఎంపీపీ పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రణాళికతో చదివితేనే ఉన్నత స్థానం

మైలవరం: ప్రతి విద్యార్థీ ప్రణాళికాబద్ధంగా చదివితే ఉన్నత శిఖరాలను చేరుకోవచ్చని స్నేహ ఐఏఎస్ అకాడమీ నిర్వాహకుడు ఎం.విజయ్ కుమార్ సూచించారు. మైలవరం డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఐక్యూఏసీ ఆధ్వర్యంలో శుక్రవారం సివిల్స్, గ్రూప్-1పై శుక్రవారం అవగాహన కార్యక్రమం జరిగింది. సివిల్స్‌కు ఎలా శిక్షణ పొందాలి అన్న అంశాలను విజయ్‌కుమార్ వివరించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఇళ్ల రవి తదితరులు మాట్లాడారు.

వాహనాల బహిరంగ వేలంతో రూ.1.15 లక్షల ఆదాయం

చిల్లకల్లు(జగ్గయ్యపేట): పలు ఎక్సైజ్ కేసుల్లో పట్టుబడిన వాహనాలకు బహిరంగ వేలం పాట ద్వారా రూ. 1.15 లక్షల ఆదాయం వచ్చిందని ఎస్ఐ కృష్ణబాబు తెలిపారు. స్థానిక పశువుల సంత వద్ద శుక్రవారం సర్కిల్ పరిధిలోని చిల్లకల్లు, వత్సవాయి పీఎస్‌ల పరిధిలోని పలు ఎక్సైజ్ కేసుల్లో పట్టుబడిన రెండు ఆటోలు, నాలుగు ద్విచక్ర వాహనాలకు బహిరంగ వేలం పాటలు నిర్వహించారు. వేలం పాటలో ఎస్ఈబీ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన సేద్య పద్ధతులు పాటించాలి

జి.కొండూరు: వ్యవసాయాధికారుల సూచనల మేరకు రైతులు సేద్యం చేస్తే పంట దిగుబడులు లాభసాటిగా ఉంటాయని ఎంపీపీ వేములకొండ లక్ష్మీతిరుపతమ్మ సూచించారు. మండలంలోని కుంటముక్కల గ్రామంలో శుక్రవారం వైఎస్సార్ పొలంబడి కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా వనరుల కేంద్రం డైరెక్టర్ డాక్టర్ మాధవీలతతో పాటు ఎంపీపీ లక్ష్మీతిరుపతమ్మ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మెరుగైన సేద్య పద్ధతులపై డాక్టర్ మాధవీలత రైతులకు అవగాహన కల్పించారు. సర్పంచ్ వంగూరి కుమారి కెనడీ, ఏట రాంకుమార్, రైతులు పాల్గొన్నారు.

వేణుగోపాలుని నగరోత్సవం

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): కృష్ణాష్టమిని పురస్కరించుకొని వన్‌టౌన్‌లోని పలు ప్రాంతాల్లో ఉట్టి మహోత్సవాలు శుక్రవారం రాత్రి అత్యంత వైభవంగా జరిగాయి. కేటీరోడ్డు, బ్రాహ్మణ వీధి, నెహ్రూబొమ్మ సెంటర్‌తో పాటుగా పలు ప్రాంతాల్లో యువజన సంఘాలు, కులసంఘాల ఆధ్వర్యంలో ఉట్టి మహోత్సవాలు కనుల పండువగా నిర్వహించారు. స్థానిక నెహ్రూబొమ్మ సెంటర్‌లోని శ్రీ వేణుగోపాలస్వామి దేవస్థానంలో స్వామి వారు నగరోత్సవంగా ఆయా ప్రాంతాలకు తరలివచ్చారు. స్థానికంగా ఏర్పాటు చేసిన ఉట్టి మహోత్సవ నిర్వాహకులు స్వామికి పూజలు నిర్వహించి ఉట్టి కొట్టుడు కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాలు సందడిగా దర్శనమిచ్చాయి. ఉట్టి కొట్టే వ్యక్తులపై ఒకవైపు రంగులు, మరోవైపు నీటిని బలంగా విసురుతుండగా పైన ఉన్న కలశాన్ని కొట్టి యువకులు సందడి చేశారు. నగరోత్సవం స్వామి వారి సన్నిధి నుంచి ప్రారంభమై కేటీ రోడ్డు, శేషయ్య వీధి, బ్రాహ్మణవీధి తదితర ప్రాంతాల మీదుగా తిరిగి ఆలయానికి చేరుకుంది. అదేవిధంగా వసంత మల్లికార్జునస్వామి వార్ల దేవస్థానం మాజీ చైర్మన్ బొట్టా కొండలరావు స్థానిక మరుపిళ్ల చిట్టి ఇంటి సెంటర్‌లో ఉట్టి మహోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు, మేయర్ రాయన భాగ్యలక్ష్మి, శ్రీ దుర్గామల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానం చైర్మన్ కర్నాటి రాంబాబు తదితరులు హాజరయ్యారు. స్వామి వారికి పూజలు నిర్వహించారు.

గణనాథుల ముస్తాబు





వినాయకచవితి పండుగకు గణనాథుల విగ్రహాలను సిద్ధం చేస్తున్నారు. రాజస్తాన్‌కు చెందిన కళాకారులు జగ్గయ్యపేటలో.. భక్తులను ఆకట్టుకునేలా విగ్రహాలను తయారు చేస్తున్నారు. నాలుగునెలల నుంచి విగ్రహాలను తయారు చేస్తున్నామని, పగలు రాత్రి పని చేస్తేనే అందించగలమని విగ్రహాల తయారీ కేంద్రం యజమాని రాథోడ్‌మిటు తెలిపారు. విగ్రహాల సైజులను బట్టి రూ.5 వేల నుంచి 35 వేల వరకు ధరలు ఉన్నాయి. చిన్న విగ్రహాల ధర రూ. 1200 చెబుతున్నారు.
-జగ్గయ్యపేట అర్బన్

సీఎంఆర్‌ఎఫ్‌తో ఆర్థిక సహకారం

నందిగామటౌన్: ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా నిరుపేదలకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆర్థిక సహకారం అందిస్తున్నారని ఎమ్మెల్యే మొండితోక జగన్‌మోహనరావు పేర్కొన్నారు. పట్టణంలోని ఎమ్మెల్యే కార్యాలయంలో ప్రభుత్వం నుంచి మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను శుక్రవారం ఆయన లబ్ధిదారులకు పంపిణీ చేశారు. జగన్‌మోహనరావు మాట్లాడుతూ ఐదుగురు లబ్ధిదారులకు ప్రభుత్వం నుంచి రూ. 4.25 లక్షలు మంజూరయ్యాయన్నారు. వైద్య ఖర్చుల భారం నిరుపేదలపై పడకూడదనే మంచి మనసుతో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సీఎంఆర్‌ఎఫ్‌తో అండగా నిలుస్తున్నారని తెలిపారు. నియోజకవర్గంలోని 415 మంది లబ్ధిదారులకు రూ. 2,018 కోట్లను అందించినట్లు చెప్పారు. గత ప్రభుత్వాలకు భిన్నంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని కొనియాడారు. 2600 పైగా జబ్బులను ఆరోగ్య శ్రీ పథకంలో చేర్చి ఉచిత వైద్యమందిస్తున్న ఏకైక ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డి పేరు తెచ్చుకున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ పాకాలపాటి కృష్ణ, కంచికచర్ల వైస్ ఎంపీపీ బండి మల్లికార్జునరావు, నాయకులు కరి రవీంద్రబాబు, పలువురు నాయకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.



సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

అన్ని ప్రాంతాల్లో సమగ్ర అభివృద్ధి

నందిగామ: పట్టణంలోని అన్ని ప్రాంతాల్లో సమగ్ర అభివృద్ధి చేయడమే లక్ష్యమని మున్సిపల్ కమిషనర్ జయరాం తెలిపారు. పట్టణంలోని ఎనిమిదో వార్డు పరిధిలో శుక్రవారం ఆయన పర్యటించారు. అక్కడ జరుగుతున్న ప్రత్యేక పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ అభివృద్ధికి ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు కృషి చేస్తున్నారన్నారు. ఈ క్రమంలో రోడ్లు, కాలువలను అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. అభివృద్ధి పనులకు ప్రజా సహకారం కావాలన్నారు. వానలు కురుస్తుండటంతో అన్ని వార్డుల పరిధిలో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దోమల నివారణకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పరు. కార్యక్రమంలో వార్డ్ ఇన్‌చార్జ్ గుడివాడ సాంబశివరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



సైడ్ డ్రెయిన్లను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ జయరాం

విధిగా పంట నమోదు

బలుసుపాడు (జగ్గయ్యపేట): రైతులు విధిగా పంట నమోదు చేయించుకోవాలని ఏవో వరలక్ష్మి పేర్కొన్నారు. గ్రామంలో జరుగుతున్న పంట నమోదు ప్రక్రియను శుక్రవారం పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ 2023 ఖరీఫ్ పంటకాలానికి సంబంధించి ఈ క్రాప్ నమోదవుతోందన్నారు. దీన్ని చేయించుకుంటే ప్రభుత్వం నుంచి వచ్చే వైఎస్సార్ ఉచిత పంటల బీమా, ఇన్పుట్ సబ్సిడీ, పంట రుణాలు, సున్న వడ్డీ ధాన్యం కొనుగోలు మొదలైన ప్రభుత్వ పథకాలు అందుతాయని చెప్పారు. గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాల్లో వ్యవసాయ అధికారులను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో వీఏ సాయిరాం తదితరులు పాల్గొన్నారు.



పంట నమోదు ప్రక్రియను పరిశీలిస్తున్న ఏవో

పైథాన్ వర్క్‌షాపుతో నైపుణ్యాలు మెరుగు

మైలవరం: పైథాన్ ప్రోగ్రామింగ్ వర్క్‌షాపు వల్ల విద్యార్థుల సాంకేతిక నైపుణ్యాలు మెరుగుపడతాయని స్కిల్ డెవలప్‌మెంట్ కోఆర్డినేటర్ డాక్టర్ వై.విజయభాస్కరరెడ్డి సూచించారు. మైలవరంలోని లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో ఏపీ ఎస్ఎస్‌డీసీ ఆధ్వర్యంలో పైథాన్ ప్రోగ్రామింగ్ శిక్షణ తరగతులు శుక్రవారం ముగిశాయి. సాంకేతిక నైపుణ్యాలు మెరుగుపర్చుకోని ఉద్యోగావకాశాలు ఎలా పెంపొందించుకోవాలో వివరించారు. ఏపీఎస్ఎస్‌డీసీ ట్రైనర్ కె.మీనాక్షి రిసోర్స్‌పర్సన్‌గా వ్యవహరించి మాట్లాడుతూ.. పైథాన్ ప్రోగ్రామింగ్ ఆవశ్యకతను, ప్రాముఖ్యతను, లూప్స్, డాటా స్ట్రక్చర్స్, ఊప్స్ కాన్సెప్ట్, ఫైల్స్ ఆపరేషన్స్ అండ్ ఫంక్షన్స్ గురించి వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ కె.అప్పారావు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.హరినాథరెడ్డి, ఈఈఈ విభాగాధిపతి డాక్టర్ జె.శివవర ప్రసాద్, పాల్గొన్నారు. సీహెచ్ రాజేష్, జి.తబిత కోఆర్డినేటర్లుగా వ్యవహరించారు.

సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలి

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): సేవా కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని రాష్ట్ర హ్యూమన్ రైట్స్ కమిషన్ సభ్యుడు జి.శ్రీనివాసరావు పేర్కొన్నారు. సంపర తాతాబ్బాయ్ ట్రస్ట్, ఏబీసీడీ ట్రస్ట్ ఆధ్వర్యంలో శుక్రవారం తోపుడు బండ్లు పంపిణీ చేశారు. నేత్రదాన పక్షోత్సవాలను పురస్కరించుకుని అర్జునవీధిలో నిర్వహించిన కార్యక్రమానికి శ్రీనివాసరావు, ప్రముఖ న్యాయవాది సంపర శ్రీనివాస్ పాల్గొన్నారు. ప్రజలకు, సమాజానికి మేలు కలిగించే కార్యక్రమాలను ప్రతి ఒక్కరూ నిర్వహించాలని సూచించారు. నేత్రదానంపై అవగాహన కల్పించడంతో చూపు లేని వారి ఎందరికో చూపును ప్రసాదించవచ్చునన్నారు. కార్యక్రమంలో ఏబీసీడీ ట్రస్ట్ చైర్మన్ ఆవులు వెంకట్రావు, న్యాయవాది ఎస్.కోటబాబు పాల్గొన్నారు.



తోపుడు బండి అందజేస్తున్న దాతలు

ఎన్‌సీసీ కేడెట్స్‌కు క్రమశిక్షణ అవసరం

లబ్బీపేట(విజయవాడతూర్పు): ఎన్‌సీసీ కేడెట్స్‌కు క్రమశిక్షణ ఎంతో అవసరమని 4(ఎ) బాలికల బెటాలియన్ ఎన్‌సీసీ కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ బలెందర్ సింగ్ అన్నారు. నలంద డిగ్రీ కళాశాల ఎన్‌సీసీ యూనిట్ ఆధ్వర్యంలో ఎన్‌రోల్‌మెంట్ ఆఫ్ ఎన్‌సీసీ క్యాడెట్స్ 2023-24కు శుక్రవారం సెలక్షన్స్ నిర్వహించారు. కొత్తగా సెలెక్ట్ అయిన ఎన్‌సీసీ కేడెట్స్‌ను ఉద్దేశించి కల్నల్ బలెందర్ సింగ్ మాట్లాడుతూ.. ఎన్‌సీసీ ఉపయోగాలు, ప్రాధాన్యం, క్యాంప్‌ల గురించి వివరించారు. ప్రతి క్యాంప్‌నకు కేడెట్స్ తప్పకుండా హాజరవ్వాలని సూచించారు. రిపబ్లిక్ డే పరేడ్స్‌కు టీఎస్‌సీ క్యాంప్‌నకు వెళ్లాలని తెలియజేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఎం.అనురాధ, ఎన్‌సీసీ సుబేదార్ రాజ్‌పాల్, నాయక్ కుందన్‌కుమార్, హవల్దార్ పీవీటీ రెడ్డి, కళాశాల ఎన్‌సీసీ ఏఎన్‌ఓ ఎస్‌కే రఫీయాబేగం తదితరులు పాల్గొన్నారు.



ఎన్‌సీసీ క్యాడెట్స్‌తో బలెందర్‌సింగ్, ప్రిన్సిపాల్ అనురాధ తదితరులు

ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలకు ప్రింటర్ బహూకరణ

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): పూర్వ విద్యార్థుల సంఘం సభ్యులు కళాశాల అవసరాలను గుర్తించి ప్రింటర్‌ను బహూకరించడం అభినందనీయమని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.విజయసారథి తెలిపారు. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల పూర్వ విద్యార్థుల సంఘం సభ్యులు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఉపయోగించడానికి ప్రింటర్‌ను కొనుగోలు చేసి ప్రిన్సిపాల్ ఎం.విజయసారథికి శుక్రవారం అందజేశారు. సంఘం అధ్యక్షుడు ఎంపీ.బాబు, కార్యదర్శి గోపిచంద్, సభ్యుడు కిషోర్, కళాశాల ఎలక్ట్రికల్ విభాగాధిపతి బి.భీమా నాయక్, మెటాలజీ విభాగాధిపతి శ్రీనివాసరెడ్డి, రిటైర్డ్ అధ్యాపకుడు వి.భానుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

11 నుంచి యోగా శిక్షణ తరగతులు

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): శాంతివన్ యోగా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 11వ తేదీ నుంచి ఉచిత యోగా శిక్షణ తరగతులు జరుగుతాయని యోగా గురువు లంకే జనార్దన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కొండపల్లి బీకాలనీ ఆడిటోరియంలో 15 రోజుల పాటు ఉదయం, సాయంత్రం శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు.